ప్రజాశక్తి

సోమవారం 29 ఏప్రిల్ 2024

I

అల్లూరి సీతారామరాజు

ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:-సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రం, కుజబంగి జంక్షన్‌లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎన్నికలు కావడంతో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. మద్యం రవాణా పై ప్రత్యేక నిఘా పెట్టారు. బ్రిడ్జిలు, మలుపుల్లో తనిఖీలు చేపడుతున్నారు.

తనిఖీలు చేపడుతున్న పోలీసులు

అక్రమాలు 'అనంత'ం

- గనుల నుండి గంజాయి వరకు అన్నీ ఆయన కనుసన్నల్లోనే
- పలు కేసుల్లో నిందితుడు
- అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొన్నింటిని తొలగించుకున్న వైనం
- పదేళ్లు నుండి షాడో ఎమ్మెల్యేగా వ్యవహారం
- తాజా ఎన్నికలలో తప్పని చుక్కెదురు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

వైసిపి ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయభాస్కర్ (అనంతబాబు) అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏజెన్సీలో ఈ పేరు తెలియవారు ఉండరంటే అతిశయోక్తి కాదు. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి నుంచి గనుల వరకు అక్రమాలన్నీ ఆయన కనుసన్నల్లోనే జరుగుతుంటాయని ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. ఆది నుంచీ వివాదాల్లో కొనసాగుతూ పలు కేసుల్లో ప్రధాన నిందితునిగా ఉన్నారు. అనేక సందర్భాల్లో పలు వివాదాలకు ఆయనే ఆజ్యం పోసినట్లు విమర్శలున్నాయి. అధికారుల విధులకు ఆటంకం కలిగించడం, కలప అక్రమ రవాణా, మహిళలపై వేధింపులు, ఇతరులపై దాడులు వంటి పలు కేసులు ఆయనపై నమోదయ్యాయి. ఈ కేసుల్లో చాలా వరకూ మాఫీ చేయించుకున్నారన్న విమర్శలున్నాయి. వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్సీగా ఎన్నికై కొన్ని కేసులను తొలగించుకున్నట్లు సమాచారం. దాంతోపాటు గతంలో అడ్డతీగల పోలీస్ స్టేషన్లో నమోదైన రౌడీషీటర్ కేసు కూడా కొద్ది కాలం తర్వాత తొలగించారు. ఈయనపై పలు కేసులున్నా టీడీపీ అధికారంలో ఉంటే సొంత మేనమామ జ్యోతుల నెహ్రూ, కాంగ్రెస్ పాలనలో మరో మేనమామ వరుపుల సుబ్బారావు ద్వారా పనులు చక్కబెట్టుకునే వాడని విమర్శలు ఉన్నాయి. గత పదేళ్లుగా ఏజెన్సీలో షాడో ఎమ్మెల్యేగా చక్రం తిప్పుతున్నారు.

ఓ కేసులో పోలీసుల అదుపులో ఉన్న అనంతబాబు (ఫైల్‌ఫోటో)

మెట్ట ప్రాంతం నుంచి ఏజెన్సీకి వలస

అనంతబాబు కుటుంబం కొన్ని సంవత్సరాల క్రితం మెట్ట ప్రాంతం నుంచి ఏజెన్సీకి వలస వెళ్లింది. గిరిజనులపై వేధింపులు, ఏజెన్సీ భూముల ఆక్రమణ, వడ్డీల పేరుతో అక్రమ వసూళ్లు ఇలా అనేక ఆరోపణలు అనంతబాబు తండ్రి అనంత చక్రధరరావుపై ఉండేవి. దీంతో నక్సల్స్ పలుమార్లు హెచ్చరించినా ఆయన ఖాతరు చేయకపోవడంతో చక్రధరరావును 1986లో ఆయన స్వగ్రామం ఎల్లవరంలో హతమార్చారు. అనంతబాబు చదువు పూర్తి చేసుకున్న తరువాత రాజకీయాల్లోకి వచ్చి కాంగ్రెస్ పార్టీ తరుపున జెడ్పీటీసీగా ఎన్నికై అడ్డతీగల మండలంలో పట్టు సాధించారు. తరువాత దొరమామిడి ఎంపిటిసిగా ఎన్నికై ఎంపిపిగా పని చేసి నియోజకవర్గ రాజకీయాల వైపు మళ్లాడు.

నకిలీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ పై ఆరోపణలు

ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రం విషయంలో గతంలో అనంతబాబుపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. 2006లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా నకిలీ ఎస్టీ సర్టిఫికెట్ ద్వారా దొరమామిడి ఎంపీటీసీగా పోటీలోకి దిగాడు. టీడీపీ వాళ్లు అతనితో రాజీపడగా సిపిఎం అభ్యర్థి అతని ఫేక్ సర్టిఫికెట్‌ని ఛాలెంజ్ చేశారు. అయితే దీనిపై ఆయన స్టే తెచ్చుకొని ఎంపిపిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత అదే కుల ధ్రువీకరణపత్రంతో 2014 సాధారణ ఎన్నికల్లో నామినేషన్ వేశారు. అప్పుడు నకిలీ కుల ధ్రువీకరణ ప్రతంపై సిపిఎం, నాటి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతబాబు నామినేషన్‌ను తిరస్కరించారు. దీనిపై ఆయన సుప్రీంకోర్టుకి వెళ్లినా అతనికి అనుకూలంగా తీర్పు రాలేదు. ఈ నేపథ్యంలో 2014 ఎన్నికల్లో డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన వంతల రాజేశ్వరి వైసిపి అభ్యర్థి కావడంతో ఆమెకు మద్దతు ఇచ్చి అన్నీ తానై గెలిపించారు. ఎమ్మెల్యే లెటర్ హెడ్ సహా అన్నీ తన దగ్గరే ఉంచుకుని అధికారం చక్కబెట్టేవారు. కొంతకాలానికి అనంత బాబు వ్యవహార శైలిపై నమ్మకం కోల్పోయిన రాజేశ్వరి వైసీపీని వదిలి టీడీపీలోకి చేరారు. దీంతో అనంతబాబు 2019 ఎన్నికల్లో నాగులపల్లి ధనలక్ష్మిని తెరమీదకు తీసుకొచ్చి, ఆమె గెలుపులోనూ మళ్లీ అంతా తానై వ్యవహరించి నియోజకవర్గమంతటా పట్టు సాధించారు. దాంతో అధికారంలో ఉన్న వైసీపీ తొలుత డీసీసీబీ చైర్మన్, ఆ తర్వాత ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టింది. పేరుకే ధనలక్ష్మి ఎమ్మెల్యే.. అధికారమంతా అనంతబాబుదే అన్న విమర్శలున్నాయి. తాజా ఎన్నికల్లోనూ మరో సారి ధనలక్ష్మిని తరుపున అనంతబాబు ప్రజాక్షేత్రంలో తలపడేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఆయనకు అడుగడుగునా గిరిజనుల నుండి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నెల 7న కూనవరం మండలం కూటూరులో అనంతబాబు చేపట్టిన ప్రచారంలో గిరిజన యువకులు నిరసన తెలిపగా, ఆయన గన్‌మెన్‌ల చేత కొట్టించడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి రవాణాలో అనంత బాబుకు కీలకపాత్ర ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. గంజాయి ద్వారా వచ్చే ఆదాయంలో 70 శాతం మేరకు ఆయన ఖాతాకు చేరుతున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనంతబాబు చిన్నతనం నుంచీ వివాదాస్పదుడుగానే ఎదిగినట్టు పలువురు చెబుతున్నారు. ఆయన తండ్రి అనంత చక్రధరరావు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో నక్సల్స్ ఆయన్ను హతమార్చారు. అయితే అనంతబాబు కూడా అదే ఒరవడిని కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మావోయిస్టుల నుంచి అనంతబాబుకు కూడా హెచ్చరిక రావడంతోనే ఏజెన్సీ నుంచి కాకినాడకు మకాం మార్చినట్లు సమాచారం. గతంలో ఎన్నికల సందర్భంగా ఎన్నికల సిబ్బంది, పోలీసులు అధికారుల విధులకు ఆటంకం కలిగించినట్లు కేసులు కూడా నమోదయ్యాయి. ఇలా పలు కేసుల్లో నిందితుడిగా, కొన్ని కేసుల్లో ప్రధాన నిందితుడిగా అనంతబాబు ఉండడం విశేషం. దీంతో ఆయనపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ రాజకీయ పార్టీలతో ఆయనకున్న సంబంధాలు, అధికార పార్టీలో ఉండడంతో పలు కేసులను కొట్టి వేయించుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. గతేడాది తన మాజీ కారు డ్రైవరు సుబ్రహ్మణ్యం హత్య కేసులో నేరుగా నేరం అంగీకరించడంతో ఈ కేసులో నైనా అనంత బాబుకు శిక్ష పడుతుందా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

ఈ నెల 7న అనంతబాబు అనుచరులు, గన్‌మ్యాన్ చేసిన దాడిలో గాయపడిన గిరిజన యువకుడిని పరిశీలిస్తున్న సిపిఎం నేతలు లోతా రామారావు, కిరణ్ (ఫైల్‌ఫోటో)

పట్టుబడిన నిందితులతో పోలీసులు

420 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండలంలోని పాలమామిడి పంచాయతీ పెద్దపాడు గ్రామంలో రవాణాకు సిద్ధంగా ఉంచిన 420 కేజీల గంజాయిను పట్టుకున్నట్టు స్థానిక సీఐ రమేష్, ఎస్ఐ శ్రీనివాస్ ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు గ్రామంలో పసుపు దొడ్డిలో రవాణాకు సిద్ధంగా గోనె సంచుల్లో ఉన్న గంజాయిని ముందస్తు సమాచారం మేరకు శనివారం ఉదయం సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామన్నారు. అదే గ్రామానికి చెందిన పాంగి పెద్దబ్బాయి, పాంగి శివయ్య, పాంగి సుబ్బారావు, పాంగి వెంకట్రావు, పాంగి రాములను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్టు తెలిపారు.

పెదబయలులో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి- పెదబయలు:మండలంలో ఓ వ్యక్తి శనివారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. దీంతో, మన్యం వాసులు ఉలిక్కిపడ్డారు. సీతాగుంట పంచాయతీ పెదబయలు గ్రామంలో మాజీ సర్పంచ్ తైసాబు త్రినాద్ ఇంట్లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ ఇంట్లో ఉన్న వర్తనపల్లి గ్రామస్తుడు శోభ హేమరాజు (35)ని మునిడిపుట్టు గ్రామానికి చెందిన పల్లుల సుందర్ రావు (అప్పారావు) రాత్రి పన్నెండు నుండి ఒంటిగంట మధ్యలో హత్య చేశాడు. వివరాల్లోకి వెళితే. వర్తనపల్లి గ్రామం నుంచి కుటుంబసభ్యులతో హేమరాజు పెళ్ళికి పెదబయలు వచ్చాడు. బంధువైన మాజీ సర్పంచ్ తైసాబు త్రినాధ్ ఇంటికొచ్చారు. ఆ రోజు రాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి మేడపై నిద్రిస్తున్న శోభా హేమరాజును నిందితుడు పల్లుల అప్పారావు ముందస్తు పథకం ప్రకారం కత్తితో హత్య చేశాడు. హేమరాజు కేకలు కేకలు వేయడంతో బంధుమిత్రులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే సుందర్రావు పరరాయ్యాడు. బాధితుడిని 108లో పాడేరు జిల్లా హాస్పిటల్ కు తరలించగా మృతి చెందాడని వైద్య సిబ్బంది తెలిపారు.ఆదివారం ఉదయం సిఐ రమేష్ కుమార్, ఎస్ఐ పులిమనోజ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

హేమరాజు మృతదేహం

వైసిపి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

- సిపిఎం జిల్లా నాయకులు పల్లపు వెంకట్

ప్రజశక్తి, మోతుగూడెం

వైసిపి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని సిపిఎం ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్ హితవుపలికారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు కలముల మల్లేష్ ఆధ్వర్యంలో చింతూరులో మండలం మండలం తులసిపాక పంచాయతీ ఈత గుంపులో ఆదివారం జరిగిన సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ ఈతగుంపులో ఎన్నికల కోడ్ అనంతరం ఒక బోరు వేసి, బోరు వద్ద ఫొటో దిగుదామని గ్రామంలో ఉన్న సిపిఎంకు చెందిన కుటుంబాలను పిలిచి, వారికి వైసిపి కండువాలు కప్పి ఫొటోలు తీసి సిపిఎం నుండి 30 కుటుంబాలు వైసీపీలో చేరినట్లు పత్రికా ప్రకటన ఇవ్వడం సిగ్గు చేటన్నారు. చింతూరు మండలంలో సర్పంచులు, ఎంపీపీ, జడ్పిటిసి, ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి వరకు వైసీపీ వారే ఉన్నప్పుడు, 5 సంవత్సరాల్లో ఎటువంటి అభివృద్ధి చేయడం చేతకాలేదన్నారు. ఇప్పుడు ఎన్నికల రాగానే ప్రజలపై ప్రేమ పుట్టుకొస్తుందని ఎద్దేవా చేశారు. ఈ కపట నాటకమంతా ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఏ ఒక్క గ్రామంలోనూ వైసీపీ ఇచ్చిన హామీలు నెరవేర్లేదని, దానితో అనేక గ్రామాల్లో వైసీపీ నుండి సిపిఎం చేరుతున్నారని చెప్పారు. ఇది ఓర్వలేక వైసిపి ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఎక్కడా సక్రమంగా నీరు ఇవ్వకుండా, ఆ నిధులన్నీ దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఇకమీదట వైసిపి నాయకులు ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేస్తే ప్రజలే సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతరం ఈతగుంపులోని ప్రజలు తాము సిపిఎంలోనే ఉంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, తులసిపాక, ఈత గుంపు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కింద్ర జంక్షన్‌లో వాహన తనిఖీలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని కింద్ర జంక్షన్ వద్ద రాజవొమ్మంగి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్ సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ముమ్మరంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో కింద్ర జంక్షన్ వద్ద జడ్డంగి రాజవొమ్మంగి ప్రధాన జాతీయ రహదారిపై వచ్చి పోయే వాహనాలను ఆపి నిశితంగా పరిశీలించారు. కారు ఇతర వాహనాల డిక్కీలు తనిఖీ చేశారు. నగదు, నాటుసారా, గంజాయి వంటి మారక ద్రవ్యాలు అక్రమ రవాణా నివారించడంలో భాగంగా తనిఖీలు చేపట్టడం జరుగుతుందని సీఐ సన్యాసినాయుడు తెలిపారు. రూ.50 వేలుకు మించి నగదుగాని, రూ.10 వేలు కంటే ఎక్కువ విలువ చేసే వస్తువులుగాని తమవెంట తీసుకొని వెళితే సరైన ఆధారాలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో రాజవొమ్మంగి ఎస్ఐ యస్ వెంకయ్య , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కారులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కూటమి, వైసిపి అభ్యర్థులను ఓడించాలి

- మన్యంలో ముమ్మరంగా సిపిఎం నేతల ప్రచారం

అరకు మండలంలో ప్రచారం చేస్తున్న లోకనాథం, నాయకులు

ప్రజాశక్తి- అరకులోయ :ఇండియా కూటమి బలపరిచిన అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనరసను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. లోకనాథం కోరారు. మండలంలోని సుంకర మెట్ట పంచాయతీ వారపు సంతలో ఆదివారం సిపిఎం నేతలు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, ఆదివాసి గిరిజనులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదన్నారు. యువతి, యువకులకు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, పొద్దు బాలదేవ్, గతుం బుజ్జి బాబు, కొర్రా మగ్గన్న, పాంగి రామన్న, జన్ని భగత్ రామ్, కిల్లో మహేష్, శివాజి, సీతన్న, జయరాం రామన్న శంకర్ సంతోష్, దేవరాజు, నాగేష్ , రామకృష్ణ, విజయ్, సత్యా రావు, జోషి తదితరులు పాల్గొన్నారు.

పాడేరు: రానున్న ఎన్నికల్లో వైసిపి, బిజెపి, టిడిపి పార్టీల అభ్యర్థులను ఓడిస్తేనే ఆదివాసీల హక్కులకు రక్షణ కలుగుతుందని అరకు సిపిఎం లోక్‌సభ అభ్యర్థి పి.అప్పలనరస గిరిజన ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని మారుమూల ప్రాంతాలైన వంట్ల మామిడి, గుర్రగరువు, ఓనూరు, నందిగరువు, డల్లాపల్లి, తప్పిపుట్టు, సంగోడి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు గిరిజన రక్షణ చట్టాల అమలను ఉల్లంఘించి ఆదివాసీల మనుగడకు విఘాతం కలిగిస్తున్నాయని విమర్శించారు. గిరిజన హక్కులు, చట్టాలకు ముప్పు తలపెడుతున్న ఈ పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించి ఇంటికి సాగనంపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎల్.సుందర్రావు, పి లక్కు, బొజ్జన్న, సూరిబాబు, శ్రీను, చిట్టిబాబు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ:మండలంలోని పోతంగి పంచాయతీ కోసంగి పనసపుట్టులో సిపిఎం నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్సకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌బి పోతురాజు,గసభ పంచాయతీ మాజీ సర్పంచ్ సురేష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి టిడిపి, వైసీపీ, జనసేన పార్టీలు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. నాయకులు పి.సత్యనారాయణ, ధనరాజ్ పడాల్, సింహాద్రి, నారాయణ, భగత్ పాల్గొన్నారు.

హుకుంపేట:మండలంలోని పట్టం పంచాయతీ బూరువలస, అమనగిరి గ్రామాల్లో సిపిఎం నేతలు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హైమావతి, దేవుడు నాయుడు, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు, చిట్టిబాబు, మూర్తి, ఆనంద్ పాల్గొన్నారు.

అనంతగిరి: మెట్టవస తదితర గ్రామాల్లో అనంతగిరి, లుంగపర్తి పంచాయతీ సిపిఎం జోన్ బాధ్యులు జన్ని .బీమన్న, సుబ్బారావులు ప్రచారం నిర్వహించారు. గిరిజన సమస్యపై నిరతరం పోరాటం చేసే అప్పలనర్సను పార్లమెంట్‌కు పంపాలని కోరారు. ఎగువశోభ పంచాయితీ మరదగుడ, చుట్టూ పక్కల గ్రామాల్లో సిపిఎం నేతలు ప్రచారం చేపట్టారు.జడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, కార్మికులకు, కర్షకులకు ఎర్ర జెండా ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దీసరి లక్ష్మణరావు, కార్మికులు పాంగి రాము, జన్ని సుబ్బారావు, చిట్టం ప్రకాశ్, జన్ని లక్ష్మణరావు, దయానిధి పాల్గొన్నారు.

విఆర్.పురం:రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించి అసెంబ్లీ, పార్లమెంట్‌కు పంపించడం ద్వారానే పోలవరం నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ నాయకులు పూనెం సత్యనారాయణ, సోయం చిన్నబాబు అన్నారు. కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ పార్టీలు (ఇండియా వేదిక) బలపర్చిన రంపచోడవరం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సలను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని చిన్నమట్టపల్లి, కన్నాయిగూడెం, వడ్డిగూడెం గ్రామాల్లో సిపిఎం కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, చిన్నబాబు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేయడంలో కేంద్ర బిజెపి, రాష్ట్రంలోని టిడిపి, వైసిపి ప్రభుత్వాలు వైఫల్యం ఈ పదేళ్లలో పూర్తి వైఫల్యం చెందాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రదీప్ కుమార్, మాజీ ఎంపీటీసీ సున్నం పార్వతి, మెట్టెం గంగరాజు, మడకం రాజు పాల్గొన్నారు.

రంపచోడవరం : రంపచోడవరం గ్రామంలోని అంబేద్కర్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ సెంటర్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సెంటర్, బొర్నగూడెం తదితర ప్రాంతాల్లో సిపిఎం నాయకులు ప్రచారం చేశారు. ప్రజానాట్యమండలి కళాకారుల నృత్యాలు, పాటలు ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పిఎన్‌ఎం రాష్ట్ర నాయకులు మంగరాజు, క్రాంతి మాట్లాడారు. కార్యక్రమంలో పిఎన్‌ఎం కాకినాడ జిల్లా కమిటీ నాయకులు బంగార్రాజు, రాము, మురళి, సంజన, యశ్వంత్, శ్రీను, భాస్కర్, సుందర్ బాబు, రాంబాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ పరిధిలోని గ్రామాలలో సిపిఎం, ప్రజా నాట్యమండలి నాయకులుప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కేత గోపాలన్ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంత సమస్యలు చట్ట సభల్లో వినిపించడానికి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిపిఎం నాయకులు చింత రాంబాబు, కాంగ్రెస్ నాయకులు మొండేటి వెంకటేశ్వరరావు, రతన్ రాజు, విజయ్ కుమార్, రమేష్, సురేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం : మండలంలోని దండంగి, గోపన్నపాలెం, నాగుల గూడెం, గోపాలపురం గ్రామాలలో సిపిఎం కార్యకర్తలు ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసి విస్తృతంగా ప్రచారం చేశారు. సిపిఎం నాయకులు పి.రామకృష్ణ మాట్లాడారు. నాయకులు ఏ శ్యామలరాణి, జి.సూర్య కిరణ్, జె.గోపి, ఎస్ సాయి, విజయలక్ష్మి, బుల్లెమ్మా, బేబమ్మ చంటి పాల్గొన్నారు.

పాడేరు మండలంలో ప్రచారం చేస్తున్న అప్పలనర్స

కొయ్యూరు : మండల కేంద్రం కొయ్యూరు వారపు సంతలో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. సిపిఎం అల్లూరి జిల్లా నాయకులు ఎస్ సూరిబాబు, సిఐటియు నాయకులు గిరిజనులకు కరపత్రాలు పంపిణీ చేశారు. గిరిజనులకు బిజెపి ద్రోహం చేసిందని, సిపిఎం కమ్యూనిస్టుల బలమే ప్రజలకు రక్షణగా ఉంటుందని చెప్పారు.

సిపిఎం అభ్యర్థి లోతాకు నీరాజనం

అడ్డతీగల:రంపచోడవరం సిపిఎం అభ్యర్థి లోతా రామారావుకు జనం నీరాజనం పడుతున్నారు. గంగవరం మండలంలో ఆదివారం ఆయన ప్రచారాన్ని ప్రారంభించగా, ప్రతి గ్రామంలోనూ ఘనంగా స్వాగతం పలుకుతూ కుంకుమ దిద్ది హారతులిస్తున్నారు. మీ కష్టాల్లో మీ తోడే ఉంటూ పెద్దన్నల మీ సమస్యలు పూర్తయ్యే విధంగా ముందుంటానని లోతా రామారావు హామీ ఇచ్చారు. సమస్య అంటూ ఒక్క ఫోన్ చేస్తే అర్ధరాత్రి కూడా మీ ఇంటికి వచ్చి పరిష్కారం చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. రంపచోడవరం అభివృద్ధి చెందాలంటే ఒక్కసారి సిపిఎంకి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకే ఓటు వేస్తామని ఓటర్లందరూ ముక్తకంఠంగా తెలిపారు. సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

గంగవరం మండలంలో ప్రచారం చేపడుతున్న లోతా రామారావు

శరవేగంగా రోడ్డు పనులు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని ఎంకె.పట్నం నుండి బిబి.పట్నం, రత్నంపేట మీదుగా వడ్డిప వరకు రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గత ఆరేళ్లుగా ఈ రోడ్డు పనులు జరుగుతూ ఉన్నాయి. ఈ మూడు పంచాయతీ గ్రామాల ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకుంటే ఈ గ్రామాల్లో తిరగలేమని వైసిపి నాయకులు చెప్పడంతో ఆదరాబాదరాగా పనులు చేపట్టారు. గొలుగొండ మండలం ఏటిగైరంపేట నుంచి ఎంకె.పట్నం వరకు బిటి రోడ్డు పనులు సాగుతున్నాయి. రెండు మూడు రోజుల్లో వడ్డిప వరకు రోడ్డు నిర్మాణం పూర్తి కావస్తుందని ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండల కేంద్రంలోనీ నేతాజీ ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఆత్మ తృప్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అంబిడి రాజయ్య ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి (విశాఖపట్నం) సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 86 మంది కంటి పరీక్షలు చేయించుకోగా ఆరుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. అవసరమైన 16మందికి కళ్ల జోళ్ళు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ తృప్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అంబిడి రాజయ్య, గౌరవ అధ్యక్షులు రామాంజనేయులు, కార్యదర్శి గంపరై మల్లేశ్వరరావు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నేతలు బజ్జంగి బాబూరావు, రాజు, త్రినాధ్, శ్రీనివాస్, వర్తక సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-గొలుగొండ:టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో మాజీ వైసీపీ గొలుగొండ మండల అధ్యక్షులు రాయపురెడ్డి నాగేశ్వరరావును కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ బలోపేతం చేయడం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో జోగంపేట మాజీ సర్పంచ్ సుర్ల సీతారామమూర్తి, సీనియర్ నాయకులు చిటికల సాంబమూర్తి, చోద్యం సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, తెలుగు యువత అధ్యక్షుడు గెడ్డం ఆనంద్, లింగందొరపాలెం మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ, పోతల శ్రీరామ్మూర్తి, గాదె శ్రీనివాస్, రాయపరెడ్డి రాము పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

మండలంలోని ఏఎల్ పురం పంచాయతీకి చెందిన 50 కుటుంబాలు వైసీపీ నుండి టీడీపీలో చేరాయి. అప్పికొండమ్మ వీధి నుండి గుమ్మిడి ప్రసాద్, చింతల సుబ్రహ్మణ్యంతో పాటు ఐదు కుటుంబాలు, రెల్లివీధి, బిసి కాలనీ, ఎస్సీ కాలనీ నుంచి పలువురు చేరారు. చెల్లూరి సత్యనారాయణ(మాజీ సర్పంచ్), కర్రి కృష్ణ(మాజీ ఉప సర్పంచ్)లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు వీరందరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర పాల్గొన్నారు.

1 నుంచి వేసవి క్రీడా శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:ప్రతీ ఏడాది నింజాస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మర్ క్రీడా శిక్షణ మే 1వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు నర్సీపట్నం అకాడెమీ డైరెక్టర్స్ వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రావణ్, సుతాపాల్లి శ్రీకాంత్, పారుపల్లి శ్రీనివాస్, సైకాలజిస్ట్ సుమ, వెలగా జగన్నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ శిక్షణలో క్రీడాకారులకు ఉచిత డైట్ బ్రేక్ ఫాస్ట్‌గా అందజేస్తునామన్నారు. కరాటే, బాక్సింగ్, వూష, థాయ్ కొండో, యోగ, కిక్ బాక్సింగ్, స్కేటింగ్, వాలీబాల్, షటిల్, వెయిట్ లిఫ్టింగ్, చేస్, కేరమ్స్, వంటి వాటిలో ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటలకు శిక్షణ ఉంటుందని, వివరాలకు ఫోన్: 9550821021, 7382329353, 9492145028, 9885352987, 9346786081 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం శాఖా గ్రంధాలయంలో చిల్డ్రన్స్ క్లబ్‌లో భాగంగా ఆదివారం గ్రంథాలయాధికారి పి.దమయంతి ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కథలు చదివించారు. కథలోని నీతిని వివరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ కథలను వివరించారు.పిల్లలకు రిక్రియేషన్ గేమ్ ఆడించారు.ఎండలో తిరగవద్దని, నీళ్ల ఎక్కువగా తాగాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు ఏవీ?

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత

ప్రజాశక్తి-నక్కపల్లి:కాలేజీలకు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించకపోతే విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఎలా వస్తాయని, సర్టిఫికెట్స్ రాకపోతే జాబ్స్ ఎలా వస్తాయని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత ప్రశ్నించారు. నక్కపల్లిలోని క్రిష్ టౌన్ షిప్‌లో ఆమె స్వగృహంలో ఆదివారం తెలుగు యువత, ఐటిడిపి, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బాబును మళ్ళీ రాప్పిద్దాం అనే కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో అనిత మాట్లాడారు. సర్టిఫికెట్స్ వస్తే జాబ్స్ అడుగుతారని భావించి విద్యార్థుల చేతుల్లో గంజాయి, డ్రగ్స్ పెడుతున్నారని విమర్శించారు. పిల్లల భవిష్యత్తు ఏంటో అర్థం కాక తల్లిదండ్రులు పడుతున్న బాధ వర్ణనాతీతం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యలు చదువుకున్న వాలంటీర్లకు కేవలం 5000 ఇవ్వడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చించలపు పద్దు, రాష్ట్ర తెలుగు యువత జనరల్ సెక్రెటరీ గుర్రం రామకృష్ణ, ఐ టిడిపి అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షులు భీమర శెట్టి శ్రీనివాస్, అనకాపల్లి టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు పెద్దిరెడ్డి పండు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట : వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- నక్కపల్లి: బీసీలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి తెలిపారు. నక్కపల్లిలోని సారిపల్లివానిపాలెం హైవే జంక్షన్ సమీపంలో వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి తోటలో ఆదివారం పాయకరావుపేట నియోజకవర్గం యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగించారని, ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికె దక్కుతుందన్నారు. పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రాష్ట్ర అభివృద్ధి ,సంక్షేమం పరంగా ముందుకు తీసుకువెళ్లడం జరిగిందన్నారు. వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, పాయకరావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, యనమల కష్ణుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నానాజీ, నాయకులు లోడగల చంద్రావు, ఎలమంచిలి తాతబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి -పిఎం పాలెం : పిఎం.పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ - వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 29, 30 తేదీల్లో వికలాంగుల అంతర్ జిల్లాల జోనల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఏసీఏ విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్ నిర్వహణ కోసం క్రీడాకారులకు అవసరమైన భోజనంతో పాటు వసతి తదితర వాటిని కల్పించినందుకు ఏసీఏ అధ్యక్షులు పి.శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్ రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వికలాంగ క్రికెట్ క్రీడాకారుల అభివృద్ధికి ఏసీఏ ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.

రాష్ట్రానికి హోదా ఇవ్వని బిజెపికి మద్దతెందుకు ?

ప్రజాశక్తి-సీతమ్మధార : విభజన హామీలు అమలు చేయని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని బిజెపికి ఏ విధంగా మద్దతు పలుకుతున్నారని జై భారత్ జాతీయ పార్టీ అధ్యక్షులు, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ పాలన నచ్చదు అన్న బిజెపి రాష్ట్రంలో రెండు కుటుంబాల పార్టీలతో ఏ విధంగా పొత్తు పెట్టుకుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేసిన రాష్ట్ర అప్పులపై శ్వేత పత్రం విడుదలచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆస్తుల వివరాలు, ఏయే పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఎంత అప్పులు చేశాయో ప్రకటించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో వైసిపి, జనసేన, టిడిపి స్పష్టత ప్రకటించాలన్నారు. తమ పార్టీ గెలిస్తే నష్టపోయిన రైతులకు ప్రాధాన్యత, కూలీల ఖర్చుల కోసం నెలకు రూ.5వేలు అందిస్తామని, ఒక్కొక్క నియోజకవర్గానికి ఏడాదికి రూ.100 కోట్లు నిధులు, ఒక్కొక్క గ్రామ పంచాయతీకి ఏడాదికి రూ.కోటి నిధులు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

500 మంది చేరిక

ఉత్తర నియోజకవర్గంలోని 17 వార్డుల నుంచి సుమారు 500 మంది యువత జై భారత్ నేషనల్ పార్టీలో చేరడం చాలా సంతోషకరంగా ఉందని వివి.లక్ష్మీనారాయణ అన్నారు సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం యువతను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

రక్షణ గోడ నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వ విద్యాలయం క్రీడా మైదానం వెనుక భాగంలో హాస్టల్ భవనం చుట్టూ నిర్మిస్తున్న రక్షణ గోడ పనుల ప్రగతిని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ స్వయంగా పరిశీలించారు. పనుల ప్రగతి గురించి ఇంజినీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోడ నిర్మాణం పటిష్టంగా జరపాలని సిబ్బందికి ఆదేశించారు. రాతిని ఉపయోగించి భవనానికి రక్షణగా చుట్టూ గోడను నిర్మాణం చేస్తున్నట్లు ఇంజినీరింగ్ సిబ్బంది వివరించారు.

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనాలు ఢీ

- వ్యక్తి మృతి - ఇద్దరికి తీవ్ర గాయాలు

రోధిస్తున్న బంధువులు

ప్రజాశక్తి-హుకుంపేట: -ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్ర లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. డుంబ్రిగుడ మండలం లయగండా గ్రామానికి చెందిన కిల్లో మోహన్‌రావు(60) హుకుంపేట మండలంలోని గడుగు పల్లి గ్రామంలో బంధువుల ఇంటికి బైక్‌పై వచ్చి తిరిగి వెళుతున్నాడు.గడుగుపల్లి గ్రామం వద్ద రోడ్డు దాటుతుండగా అరుకు నుంచి హుకుంపేట వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో మోహన్ రావు సంఘటన స్థలంలోనే మృతి చెందగా ద్విచక్ర వాహనం నడుపుతున్న కిల్లో ప్రకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు 108 సమాచారం అందించి క్షతగాత్రులను వైద్య సేవలు అందించేందుకు జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎఎస్ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైసిపి అభ్యర్థి గణేష్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: వైసిపి హయాంలో అభివృద్ధి, సంక్షేమం అందించామని నర్సీపట్నం సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. ఆదివారం నర్సీపట్నం మున్సిపాలిటీ 15వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.ఎమ్మెల్యే గణేష్‌కు అడుగడుగునా వార్డు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గణేష్ ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, వార్డు కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : నియోజకవర్గ పరిధిలో ఉన్న ఓటర్లకు ఈ నెల 29వ తేదీ నుంచి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.భాస్కరరెడ్డి ఆదివారం తెలిపారు. 348 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న ఓటర్లందరికీ సంబంధిత బిఎల్ఒల ద్వారా ఓటరు స్లిప్పులు ఓటర్లకు నేరుగా అందజేస్తామని తెలిపారు.

గణబాబుకు క్రైస్తవ సంఘాల మద్దతు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92 వార్డు పరిధి లక్ష్మీనగర్‌లోని స్టీఫెన్ పాల్ చర్చి, 90వ వార్డు పరిధి ఎన్ఎడి కొత్త రోడ్డు జంక్షన్‌లోని యునైటెడ్ క్రైస్ట్ చర్చిలను తెలుగుదేశం కూటమి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సందర్శించారు. వీరిని క్రైస్తవ మత పెద్దలు ఆశీర్వదించి తమ మద్దతును తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

చిత్రాలు గీసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి-కరాస : హిందూ కోడ్ బిల్, మహాద్ చెరువు పోరాటం మీద కళ్లకు కట్టినట్టు చిత్రాలు గీసిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. నేవల్ డాక్ యార్డ్ ఉద్యోగి బుడుమూరు జగదీష్, రామగౌరి దంపతుల కుమార్తె వైనవి(14), కుమారుడు చైతన్య(10) అంబేద్కర్ జయంతి సందర్భంగా చిత్రాలను గీశారు. 104 మర్రిపాలెం ప్రాంతం కేంద్ర విశ్వవిద్యాలయంలో 9, 7 తరగతులు చదువుతున్న ఆ విద్యార్థులకు తెలుగు ప్రపంచ చిత్రకారుల సమాఖ్య వారు విజయవాడలో నేషనల్ చిల్డ్రన్ ఆర్ట్ కాంపిటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్, మెమోంటో, నగదు అందజేశారు. ఈ మేరకు వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

వైభవంగా మారెమ్మ వార్షికోత్సవం

మారెమ్మ దర్శనానికి బారులు దీరిన భక్తులు

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండలం సీలేరులో మారెమ్మ అమ్మవారి 52వ వార్షిక మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఒరిస్సా, తెలంగాణ రాష్ట్రాల నుండి అల్లూరి, అనకాపల్లి, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలతో పలు జిల్లాల నుంచి భక్తులు తండోపతండాలుగా వచ్చి అమ్మవారి ముక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. బంధుమిత్రులు పూర్వపు స్నేహితులు పండక్కి వచ్చి పరస్పరం పలకరించుకున్నారు. భక్తుల ఆర్థిక సహాయంతో భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీలేరు సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, ఇన్స్పెక్టర్ సుభాష్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఏపీ జెన్కో రిటైర్డ్ ఉద్యోగి కృష్ణమూర్తి రెగ్యులేటరీ డ్యాం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. ఆదివారం రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమాన్ని పలువురు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేశారు.

రాజవొమ్మంగి జెడ్‌పిటిసి టిడిపిలో చేరిక



రాజవొమ్మంగి జెడ్‌పిటిసి జ్యోతికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టిడిపి అభ్యర్థి శిరీష

ప్రజాశక్తి-రాజవొమ్మంగి :రాజవొమ్మంగి జెడ్పిటిసి ఒడుగుల జ్యోతి ఆదివారం టిడిపిలో చేరారు. వైసిపి మండల నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసి ఇటీవల ఆమె వైసిపికి రాజీనామా చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఆదివారం టిడిపి, జనసేన బిజెపి నాయకులు ఒట్టిగడ్డలో ఎన్నికల ప్రచారం చేపట్టగా, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీషా దేవి సమక్షంలో జెడ్‌పిటిసి ఒడుగుల జ్యోతి టిడిపిలో చేరారు. ఆమెకు శిరీషా దేవి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జెడ్పిటీసీ ఒడుగుల జ్యోతి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు.

ఒట్టిగడ్డలో ప్రచారం

మండలంలోని ఒట్టిగడ్డ గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి శిరీషా దేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పలు గ్రామాల్లో నిర్వహించిన రోడ్ షోలో ఆమె మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయం తధ్యమని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సొసైటి అధ్యక్షులు టిడిపి నాయకులు గణజాల తాతారావు, కూటమి నాయకులు ముప్పన కేశవ్, బి త్రిమూర్తులు, లోకేష్, సోమి నాయుడు పాల్గొన్నారు.

ఉచితంగా బ్యాడ్మింటన్ శిక్షణ

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పదో తరగతిలోపు విద్యార్థిని విద్యార్థులకు ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రమేష్ 9014229091, నాగేంద్ర 6303049191 నెంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి!

- నిర్మాణంలో కల్వర్టు గోతులో పడిన ద్విచక్ర వాహనం
- యువకుడు దుర్మరణం- మరో ఇద్దరికి గాయాలు
- హైవే అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే తరచూ ప్రమాదాలు
- ప్రజాశక్తి హెచ్చరించినా పట్టించుకోని అధికార యంత్రాంగం

మృతుడు గుడ్ల లక్ష్మీగణపతి (ఫైల్‌ఫోటో)

క్షతగాత్రులు జగదీష్, శివశంకర్

ప్రజాశక్తి-అడ్డతీగల : జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ప్రమాద ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అడ్డతీగల మండలం, కోనలోవ పంచాయతీ గ్రామ శివారు ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న కల్వర్టు వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డు లేకపోవడంతో అందులో శనివారం రాత్రి ద్విచక్ర వాహనం పడి ఓ యువకుడు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల తెలిపిన వివరాలు ప్రకారం...

అడ్డతీగల మండలం అనుకులపాలెం గ్రామానికి చెందిన గుడ్ల లక్ష్మీ గణపతి (24), కోటం జగదీష్ (23) మడకం శివశంకర్ (21) ముగ్గురు యువకులు శనివారం రాత్రి రాజవొమ్మంగి మండలం జడ్డంగి పంచాయతీ రేగడిపాలెం గ్రామం నుండి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. కోనలోవ పంచాయతీ గ్రామ శివారు ప్రాంతానికి వచ్చే సరికి, అక్కడ జాతీయ రహదారి పనుల్లో భాగంగా నిర్మాణంలో ఉన్న కల్వర్టు దగ్గర ఎటువంటి హెచ్చరిక బోర్డు లేకపోవడంతో, ఆ కల్వర్టు గోతులో ద్విచక్ర వాహనంతో సహా పడిపోయారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఎస్ఐ అప్పలరాజు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంలో గాయపడిన ముగ్గురు యువకులను అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే తీవ్రంగా గాయపడిన గుడ్ల లక్ష్మీ గణపతి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మిగిలిన ఇద్దరు యువకులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ సతీష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అప్పలరాజు చెప్పారు. ప్రమాదంలో యువకుడు మృతికి జాతీయ రహదారి నిర్మాణం కాంట్రాక్టరు పూర్తి బాధ్యత వహించి నష్ట పరిహారం చెల్లించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని గిరిజన సంఘం నాయకులు హెచ్చరించారు.

ముందే హెచ్చరించిన 'ప్రజాశక్తి' : పట్టించుకోని అధికార యంత్రాంగం

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చేపట్టిన కల్వర్టుల నిర్మాణాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో జరుగుతున్న ప్రమాదాలు, హెచ్చరిక బోర్డుల ఆవశ్యకతపై ఇటీవల ప్రజాశక్తి కథనాన్ని ప్రచురించింది. జాతీయ రహదారి అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యం, పోలీసు, ప్రభుత్వ అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడాన్ని ప్రస్తావించింది. అయినా గుత్తేదారులు ఎక్కడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. పోలీసు, అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు, కాంట్రాక్టరు, పోలీసు, అధికార యంత్రాంగం స్పందించి ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనదారుల ప్రాణాలు కాపాలని పలువురు కోరుతున్నారు.

చిరు జల్లులతో ఉపశమనం

మధ్యాహ్నం దారెత్తించిన ఎండ... సాయంత్రానికి చిన్నపాటి వర్షం

మధ్యాహ్నం ఎండలో గొడుగుతో వెళ్తున్న మహిళలు

సాయంత్రం కురిసిన వర్షం

ప్రజాశక్తి -సీలేరు :జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదై ప్రజలు అల్లాడిపోతున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. ఆదివారం ఉదయం నుంచి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఒకేలాగా ఉంది. ఎండవేడికి తాళలేక ఆదివారం వారపు సంతకు వచ్చిన గిరిజనులు గొడుగులు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారి ఆకాశం మేఘావృతం మబ్బులు కమ్ముకొని చిరు జల్లులు కురిశాయి. దీంతో భూమి కాస్త చల్లబడ్డంతో ఉక్క బోత, అధిక వేడి తగ్గింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు.

వంద మందికి ఉచిత వైద్యపరీక్షలు

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టివి.సుబ్బారావు, దాసరి ఉమ మహేష్, రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్ కుమార్ తదితరులు సుమారు 100 మందికి వైద్య సేవలు అందించారు. 48 మందికి రక్తపరీక్షలు, ఆరుగురికి థైరాయిడ్ పరీక్షలు, ముగ్గురికి ఫిజియథెరపీ, ఎనిమిది మందికి ఎక్స్‌రేలు చేశారు. ఈ వైద్య శిబిరంలో రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్, మేనేజర్ స్వామి రఘువీరనంద మహారాజ్, క్యాంప్ కో - ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు. రోగులకు, సహాయకులకు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు.

నాలుగు ఎకరాల జీడిమామిడి తోట దగ్ధం

దగ్ధమైన జీడిమామిడి తోటను విలపిస్తున్న బాధిత రైతు సుందరరావు

ప్రజాశక్తి -కొయ్యూరు :మండలంలోని చీడిపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు ఎకరాల జీడిమామిడి తోట అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన యల్లా సుందర్రావు అనే రైతుకు చెందిన జీడిమామిడి తోటలో ఆదివారం మంటలు వ్యాపించాయి. గుర్తు తెలియని వ్యక్తులు తోటలో నిప్పు పెట్టడం వలన జీడిమామిడి తోటలో మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయిందని బాధిత రైతు ఆవేదన చెందుతున్నారు. తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

బిజెపి, దాని మిత్రపక్షాలను ఓడించండి

- భారత నాస్తిక సమాజం విజ్ఞప్తి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ఎపిలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, దాని మిత్రపక్షాలను ఓడించి, ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు జె.రవి, టి.శ్రీరామమూర్తి, వై.నూకరాజు, చార్వాక పిలుపునిచ్చారు. కేంద్రంలో పదేళ్లపాటు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ పాలనలో మనువాద, హిందూత్వ ఫాసిస్టు, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభించిందన్నారు. అయోధ్య రామాలయమే దేశానికి ఆదర్శంగా మార్చేశారన్నారు. విద్యను పూర్తిగా కాషాయీకరణ చేస్తోందని, మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే రద్దుచేస్తామని బిజెపి, ఆర్ఎస్ఎస్ నాయకులు బహిరంగ ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, బిజెపి, దానికి అంటకాగిన పార్టీలను ఓడించడంతోపాటు ఇండియా ఫోరం బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.